ఉర్దూ కథానిక

# వాయుపుత్రులు

ఉర్దూ మూలం : కృష్ణచందర్ అనువాదకుడు : శ్రీ గిర్రాజు రామారావు

వాయుమాతకు నలుగురు కుమారులున్నారని చాలాకాలం క్రింద ఒక కథ విన్నాను. ఉత్తరము, దక్షిణము, తూర్పు, పడమర పవనాలు వారి పేర్లు. ఈ నలుగురు ఎక్కడో పర్వతపు లోయలో తమ తల్లిదగ్గర ఉంటారట. పగలంతా వీరు నలుగురు భూమి, ఆకాశాల మధ్య ఎగురుతూ తిరిగి, తిరిగి సాయంకాలం కాగానే ఇంటికి తిరిగి వచ్చేస్తారట! వారి తల్లి వాయుమాత తన బిడ్డల కప్పనుపెట్టి ఒక్కొక్కరిని ఒక్కొక్క సంచిలో పెట్టి కట్టి వేరు వేరు గదులలో ఆ సంచులను వ్రేలాడదీస్తుంది. అందరిని ఒకచోట ఉంచితే దెబ్బలాడుకుంటారని ఆమెకు భయము. వీరు నలుగురూ అన్నాలు తిని లేచేలోపుగా ఎంత అల్లరి చేస్తారో, చెప్ప నలవికాదు. వీరిని విచ్చలవిడిగా వదిలితే ప్రపంచానికే నష్టమని ఆమెకు తెలుసు.

వాయుమాత చాలా బలము కలది. ఆమె కంఠము మగవాని కంఠములాగా ధ్వనిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆమె తన బిడ్డను కోపించి, కొట్టుతుంది కూడా. అప్పుడు వారు చేసే గడబిడకు లోకమంతా కదలిపోతుంది. వాయుపుత్రులు నలుగురూ తల్లి అంటే గడగడలాడిపోతారు.

నే నీ కథ ఎప్పుడో చిన్నతనంలో విన్నాను. ఇలాంటి కథలంటే నా కిష్టము. వాటిమీద నాకు నమ్మకం కూడా. నేనొకరోజున నా మిత్రుని ఇంటికి వెళ్ళి వస్తున్నాను. అతని ఇల్లు మా వూరునుండి రెండుమైళ్ళ దూరంలో ఉంది. త్రోవలో దేవదారుచెట్ల తోపులున్నాయి. ఆతని ప్రక్కనే కొండల వరుస. ఆ కొండలమీద సంవత్సరం పొడుగునా మంచు పడుతూనే వుంటుంది. సూర్యుడిప్పుడే కొండలచాటుకు వెళ్ళాడు. అయినా ఆయన వెలుతురింకా కొంచెము మిగిలే వుంది. నా చేతిలో కర్ర వుంది. నాకీబాట అలవాటైనదే ! ఉత్తరాన మబ్బుపట్టింది. నేను చూచుకోలేదు. కర్ర త్రిప్పుకుంటూ పోతూనే ఉన్నాను.

గ్రీష్మఋతువు. రైతులు కోతలన్నీ పూర్తిచేసుకుని తాపీగా ఉన్నారు. కొండలోయల్లో అక్కడక్కడా కోయనిచేలు పచ్చగా కనుపిస్తూనే వున్నాయి. గొల్లవాండ్రు గొర్రెలను వదలి పిల్లనగ్రోవి వూదుకుంటూ కూర్చున్నారెక్కడో. గొడ్ల మెడల్లోని తాటిబుర్రగంట చప్పుడు వినిపిస్తున్నది. అవి పరుగెత్తుతున్నప్పుడు లేచిన దుమ్ము గాలితో పైకెగసి, ఆకాశములో బంగారు రేకు పరచినట్లు అందంగా కనుపిస్తున్నది. గాలిలో ఏదో మత్తుమందు కలిసినట్లున్నది. పీలుస్తున్న కొద్దీ హాయిగా ఉంది. కానీమంచుగాలి ముక్కుకు తగిలినప్పుడు మాత్రం ఎవ్వరో ముక్కు సవరిస్తున్నట్లు అనుపించింది.

నేను కర్ర త్రిప్పుకుంటూ ఈలపాడుతూ, ఏమేమో ఆలోచించుకుంటూ నడుస్తూ, దేవదారు అడివి దగ్గరకు వచ్చాను. పోస్టు జవాను ఎదురు వస్తూ, సలాం పెట్టాడు. 'చాలా ఉత్తరాలు మీ ఇంట్లో ఇచ్చానండీ'' అన్నాడు. మేముండేది కొండభూమి. వారానికొకసారి ఉత్తరాలు వస్తాయి. అందుకని ఉత్తరాలు వచ్చినవనగానే నా కపరిమిత ఆనందం కలిగింది. ఉత్తరాలు వచ్చిన రోజున మేము ఏదో పెద్ద పట్టణములో కాపురముంటున్నట్టు అనుకుంటాము. పోస్టు జవాను రానిరోజున అతను ఏ మంచు లోయలోనో పడిపోయాడనుకుంటాము.

తపాలావన్నరు సలాంపెట్టి గజ్జలకర్ర నేలకు కొట్టుకుంటూ నేను వచ్చినవైపుకు వెళ్ళిపోయాడు. నేను ఉత్తరంప్రక్క పట్టిన నల్లమేఘాన్ని అప్రయత్నంగానే చూచాను. అది నావైపే వస్తున్నది. మఫ్లరు తలకు, మెడకు చుట్టుకుని కొండల సందుగుండా క్రిందకు దిగుతున్నాను. గాలి అంతకంతకు చల్లబడుతోంది. నే నడుగులు తొందర తొందరగా వేస్తున్నాను. ఆకాశము క్రిందకు దిగుతున్నట్లు అనుపించింది. కొండలోయలో చీకటి ఆవరిస్తోంది. ఈ మబ్బులు పూర్తిగా ఈ లోయ మీదికి రాకముందే దాటగలిగానో, బ్రతికిపోతాననుకున్నాను. లేకపోతే వానకు, మంచుగడ్డకు గురి అయిపోవలసిందే?

గాలివిసురు వేగమైంది. చల్లదనం నా దవడలు నాడించేస్తున్నది. గాలి దేవదారుశాఖలనుంచి ఆనందంతో ఈలవేసుకుంటూ పోతున్నది. నా కప్పుడు ఆండర్సను వ్రాసిన చిన్నకథ —ఇంతకు ముందు చెప్పినది — జ్ఞాపకం వచ్చింది.

మఫ్లరు కంఠానికి గట్టిగా చుట్టుకున్నానో లేదో, ఉత్తర పవనుడు రంయ్యమని కోసంవచ్చినట్లు దేవదారుచెట్ల నొక్కవూపు వూపివేశాడు. కొమ్మ లెన్నో విరిగి పడ్డాయి. మంచు వడ్లగింజలాగా పెద్దపెద్ద చినుకులతో పడుతున్నది. చెవులు బ్రద్దలయ్యే మ్రోత — నీటిప్రవాహము బండల మీదనుంచి దూకుతున్నది. .. కాదు ... బండలే దొర్లుకొని వస్తున్నాయి. ఉత్తర పవనుడు పకపకా నవ్వుతున్నాడు. అతనికిదంతా ఒక చిన్న బొమ్మలాటగా వుంది కాబోలు.

ఇంతలో అంధకారం సమయాన్ని ఆవరించుకుంది. చేయిచేయి కనుపించటము లేదు. ఏ గోతిలోనో పడేవాడినే, తప్పించుకుంటున్నాను. చెప్పులు తడిసి లావెక్కాయి. తడిసి ముద్దయ్యాను. అయినా, ముందడుగు వేస్తూ ఉన్నాను. దేవుడి దయవల్ల ఈ లోయ దాటగలిగితే మాయిల్లు దగ్గరలోనే కనుపిస్తుంది. మాయిల్లు హాయి అయిన చోటు శాంతానికి ఆలవాలము. ఇప్పుడు వెచ్చగా ఉంటుంది. మా ఇంటిసంగతి తలపుకురాగానే నడక బాగా సాగింది. నా కీదారి కొట్టిన పిండేగా !

అంధకారంలోనే నడుస్తున్నా చాలాసేపటి వరకు. అంధకారంతోపాటు తుఫాను చెలరేగింది. ఎంతవరకు లోయకూ, అడవికీ అంతమే కనుపించదు ! నే నేమీ దారి తప్పలేదుకదా ?

ఈ లోయలో ఒక విచిత్రముంది. గట్టిగా కేకవేస్తే ఆ కేక నాలుగుసార్లు మరల మన చెవికే వినబడుతుంది. ఒక్క కేక వేశాను, ఆకేక వానచినుకుల సందుల్లోంచి దెబ్బలిన్నపిట్టలాగా రెపరెపలా



డుతూ ఎటుపోయిందో! ప్రతిధ్వని వినిపించ లేదు. మరల బిగ్గరగా అరిచాను.

'హోయ్' అన్నది ఉత్తర పవనము. నేను నిజంగా దారి తప్పాను. ఎక్కడికి పోతున్నానో నాకే తెలియదు. ప్రతి శిఖరాన్ని ప్రతిచెట్టును పట్టుకుని వ్రేలాడుతున్నది మనస్సు. ఈ చీకటి తనకు ఆ ప్రదేశములో హక్కు ఉన్నట్లు ఎదురు తిరిగింది. అడుగడుగునా మరణభయం కనుపించింది అయినా నేను ఆగలేదు. చలికి శరీరము గడ్డకట్టుకుపోతున్నా సరే!

అదిగో ఏదో పెద్దద్వారము కనుపిస్తోంది. అది ఆకాశములో వ్రేలాడుతున్నది. చుట్టూ చీకటితప్ప ఏమీ లేదు. ఏమైనాకానీ, నాకు ప్రాణం లేచివచ్చింది. తలుపు దగ్గరకుపోయి దానిని తట్టాను.

కొంచెము సేపటిలో తలుపు తెరుచుకుంది. ఒక ముసలమ్మ చేతిలో లాంతరు పుచ్చుకుని బయటికి వచ్చింది. ఆమె దానిని పైకెత్తి నావంక తేరిపారచూచి నిర్లక్ష్యంగా 'ఎవరు' అన్నది.

''ఒక బాటసారిని. తుఫానులో చిక్కుపడి దారి తప్పాను.''

''రా లోపలికి' అన్నది ముసలమ్మ.

లోపలికి వెళ్ళాను. పెద్దగొయ్యి ఎదురుగా ఉన్నది. అది చాలా లోతుంది. గోతికిపైన రాళ్ళబండలు కప్పబడి వున్నాయి. అవి చాలా ఎత్తు బండలమీద మంచుగడ్డలు. లోయలో దీపాలున్నాయి. అవి ప్రకృతి సహాయంతోనే వెలుగుతున్నట్లు ఉన్నాయి. వెలిగించువారు లేరు, ఆర్పువారు లేరు.

గోతిలోకి వంగి అటు ఇటూ చూచాను. అది ఇదివరకు చూచినట్లే ఉన్నది. ఒక ప్రక్క నుంచి వూటవాగు ప్రవహిస్తున్నది. దాని ప్రక్కన చిత్ర విచిత్రములైన చెట్లున్నాయి. పైన బండలమీద మంచు కుప్పలు పూలతోట్లలాగ అందంగా ఉన్నాయి. గోతిలో ఒకమూల మేజాబల్ల, దానిమీద ఒక నవయువకుడు గెడ్డము సవరించుకుంటూ కూర్చున్నాడు. అతడు తళతళమెరుస్తున్న దుప్పటి కప్పుకున్నాడు. అతడు పైకి చూచి నవ్వాడు. అప్పుడతనికండ్లు విద్యుద్దీపాలలాగా ఉన్నాయి.

'వీడు నాకొడుకు, పేరు ఉత్తర పవనుడు. ఇప్పుడు నీతోనే వచ్చాడు'' అన్నది ముసలమ్మ.

ఓహో ఇది వాయుదేవత గుహ కాబోలునని నాకు జ్ఞాపకము వచ్చింది.

'దారిలో నిన్నేడుపించుకు తిన్నాను కదూ' అంటూ ఉత్తర పవనుడు పకపకా నవ్వాడు.

''నిన్నొక గోతిలో తోసేదామనుకున్నాను. పోనీలే అని వూరుకున్నాను''

ముసలమ్మకు కోపం వచ్చి పవనుడుతో అన్నది ''అతన్ని గోతిలో త్రోసినట్లయితే నిన్ను సంచిలో పెట్టి బిగించేదాన్నే''

నేనొక ప్రక్కకు తిరిగి చూచాను. నాలుగు పెద్ద పెద్ద గోనెలు కనుపించాయి.

'తక్కిన ముగ్గురు కుమారులెక్కడ అవ్వా'' అని అడిగాను.

'నాకింకా ముగ్గురు కొడుకులున్నట్లు నీకెలా తెలుసు?'' అని ఆమె మరల ప్రశ్నించింది.'

'నేనిదివరకొకసారి యీ గుహ చూచాను'

''ఎట్లా చూచావు? ఎప్పుడు చూచావు?

ఒక కథలో చూచాను' ముసలమ్మ పగలబడి నవ్వింది. ''నీలాంటి అమాయకుణ్ణి కూడా ఒక సంచిలో పెట్ట వలసిందే, కాని నాదగ్గర అయిదో సంచి లేదు. ఈ గుహలోకి ఎవ్వరూ రాలేరు నాయనా! మా ఉత్తర పవనుడు వచ్చే వేళైందని తలుపుతీశాను, నీవూ వచ్చావు. అసలు ఈ తలుపు మనిషిమాత్రుడికి కనుపించేది కాదు సుమా! ఫరవేలేదులే ... కూర్చో .... కొంచెం పాలు, తేనె తెస్తాగాని త్రాగు పాపం!

ఉత్తర పవనుడు ''నాకు కూడా ఆకలవుతోందమ్మా'' అని నోరు చప్పరించాడు.

నీకూ ఇస్తానుండు...ఈరోజంతా ఏం పని చేశావురా కొంచెం చెప్పు అని ఆప్యాయంగా అడుగుతూ ఉట్టిమీద నుంచి పాలు, తేనె కుండలు దింపి వారి ముందర పెట్టింది.

ఉత్తర పవనుడు అన్నాడు 'అమ్మా! నేను ఉత్తర ధృవం నుంచి వస్తున్నానమ్మా! అక్కడ ఆకాశంలోని అరోరా అనే విచిత్రకాంతితో ఆడుకొన్నాను. అక్కడ రీచ్ జీవాలు పరిగెత్తుతుంటే చూచాను. మంచుకొండలు సగం వరకు నీళ్ళలో మునిగి తేలుతూ ఉంటాయి. ఒక ఓడ మంచు





ఐ స్త్రీకి పోలేక పల్లెవంకే చూస్తున్న ఎద్దుల జంట

—పి. రాజగోపాల్

కొండలను నరుక్కుంటూ ముందుకు పోవడము చూచాను. ఒక విమానం కనుపించిందమ్మా. దాని వెంటపడ్డాను. దానితో పందెం వేసి పరిగెత్తాను. కాని అది నామీదనుంచి దూకి ముందుకు పోయింది. అది ఉత్తర ధృవంమీదుగా పోయి క్రొత్త ప్రాత ప్రపంచాల కడ్డదారి కనిపెట్టింది''.

ముసలమ్మ ఎంతో శ్రద్ధగా వింటున్నది. ఉత్తర పవనుడు ఇంకా ఎలా చెప్పాడు. ''అక్కడనుంచి నేను సైబీరియా వచ్చి కుక్కల బండ్లమీద సవారి చేశాను. అక్కడ క్రొత్త ఇళ్ళు, క్రొత్త ఫ్యాక్టరీలు ఎన్ని లేచాయనుకున్నావు! గొట్టాలలోంచి వచ్చే పొగ ఆకాశమెత్తున లేస్తున్నది. గోధుమ చేలలో లక్షలమంది మనుష్యులు బుజం బుజం కలిపి ఎంత పాటుబడి పని చేస్తున్నారో నీకేం తెలుసు. ముసలమ్మ సంతోషంతో పొంగిపోయింది. ఏదో అనబోతూ ఉండగానే తలుపుకొట్టిన శబ్దము వినిపించింది. అదిగో నా దక్షిణ పవనుడు వచ్చాడు అన్నది నాతో. వాడంటే నాకెంతో వాత్సల్యం.. వాడు వట్టిచేతులతో రాడు. దక్షిణాన్నుంచి ఏవో మంచి మంచి వస్తువులు తెచ్చి నాకిస్తాడు'' ముసలమ్మ తలుపు తీయడానికి వెళ్ళింది. ఉత్తర పవనుడు కుండ ఎత్తి పాలు గటగటా త్రాగేశాడు. తర్వాత తేనెబుడ్డీ ఖాళీ చేసేశాడు. ఆమె తిరిగి వచ్చేటప్పటికి ఏమీ ఎరగనివానిలాగా కూర్చున్నాడు.

ఇంతలో ముసలమ్మ దక్షిణ పవనుడిని పట్టుకొని నెమ్మదిగా. నడుపించుకు వస్తున్నది. అతని కండ్లు నీలంగా ఉన్నాయి. విశాలమైన నుదురు, నెత్తిమీద చిలక ఈకల టోపీ, మెడలో దక్షిణ సముద్రపు లంకలలోని అందమైన నర్తకులు ధరించే పూలమాలలు, గవ్వల గొలుసులు, మృదువైన పంపాను రెల్లు దుప్పటితో అతడు వస్తున్నాడు. అతను అడుగులు వేస్తుంటే పచ్చిక బైలులో మేయుచున్న ఆలమందల మెడ గంటలు మ్రోగినట్లు ధ్వనిస్తున్నది.


కాని ఈనాడు ఎందుకనో టోపీ సగం కాలిపోయింది. మెడలోని పూలదండ వాడిపోయింది. అతడు తన తల్లిని అనుకొని ఆయాస పడుతూ వచ్చి బల్లముందు కూర్చున్నాడు. అతని ఎడమ ప్రక్కన శరీరంమీద అక్కడక్కడా బొబ్బలున్నాయి.

అతనిని చూడడముతోనే ఉత్తర పవనుడికి కోపం ఆగలేదు. ''ఎవడ్రా నిన్ను కొట్టింది. వాడిని చంపేస్తా, మంచులో పాతిపెడతా'' అంటూ గోడ్రించి లేచాడు.

దక్షిణ పవనుడు ఆయాసపడుతూ కుర్చీలో చతికిలపడ్డాడు. ముసలమ్మ పాలు తేనె తీసికొని పరిగెత్తుకొని వచ్చింది. అతడు వాటిని త్రాగి కొంచెము తెప్పరిల్లాడు.

ముసలమ్మ చింతిస్తూ అన్నది ''ఈ భూమి ఆకాశాలమధ్య ఇంతవరకు నాకొడుకుంది క్రింది చెయ్యి కానేలేదు. ఎవరు నాయనా శరీరమంతా బొబ్బలెక్కేటట్లు కొట్టింది? చెప్పు.. వాడి రక్తం త్రాగేస్తాను''

దక్షిణపవనుడు తల్లిని చేయి పట్టుకొని కుర్చీలో కూర్చుండ బెడుతూ ''ముందు నామాట వినమ్మా! నేను దక్షిణ ధృవం నుంచి వస్తున్నాను. నేను తిమింగలం వేటగాళ్ళకు సాయం చేశాను. సముద్రంలో తరంగాలు లేపాను. ఆ కెరటాలతో



ముందు తరులు - వెనుక గిరులు.... —గుణ్ణేశ్వరరావు



వారి చూపించాను. వేడి నీటిని చన్నీటిని కలిపేశాను. దక్షిణాసు దీవులలోని కొబ్బరియాకులతో ఆడుకుంటూ, అందమైన పిల్లల నృత్యం చూస్తూ కూర్చున్నాను. తర్వాత ఒక్క గంతేసి మబ్బులమీద ఎక్కి బ్రెజిల్ అడవులకు పోయాను. హవానాలో అక్షల గుర్రాలతో పరిగెత్తాను. చివరకు అలిసిపోయి ఇంటిదారి పట్టాను. దారిలో "సియోగ్రానావడా"గుండా వస్తున్నా, ఎవడో నామీద గుండు వదిలాడు. ఆ గుండు పగిలినప్పుడు దాని వెలుతురు మబ్బులలోని కోటి మెరుపు తీగల కంటె ఎక్కువగా కనుపించింది. సూర్యుడే దిగివచ్చాడా అన్నంత వేడి పుట్టింది. ఎర్రని, పచ్చని, వూదారంగు మేఘాలు నామెడను గట్టిగా పట్టుకున్నాయి. నాకు ఉక్కిరి బిక్కిరి అయింది. తుమ్ముతూ, దగ్గుతూ అక్కడినుంచి తోక జాడించాను. కాని నాశరీరము నిండా బొబ్బలు పొక్కాయి".

'నాతండ్రీ' అని తల్లి అతన్ని దగ్గరకు తీసికొన పోయింది.

'నాదగ్గరకు. రాకు నాశరీరమంతా విషము.

తల్లి ఏదో అనబోతూ ఉండగా, బయటినుండి తలుపుదగ్గర మూలుగు వినిపించింది. తూర్పుపవనుడికికూడా ఏదో ప్రమాదం వచ్చిందని ఆమె గాభరా పడుతూ, పరిగెత్తి అతనిని వెంటబెట్టుకుని వచ్చింది. తూర్పుపవనుడు కుంటు కుంటూ లోనికి వచ్చాడు. అతని జుట్టంతా చెదిరిపోయింది. శరీరముమీద చర్మము లేచిపోయింది. అక్కడక్కడ వ్రేలాడుతున్నది కూడా. ఒక్క కన్ను పోయింది. తూర్పుపవనుడు వాస్తవంగా మంచివాడు, తెలివిగలవాడు, గుణవంతుడు, అతడు చెప్పేమాటలు తల్లి ప్రతిరోజు చాలా సరదాగా వింటుంది. బాధ బానిసత్వము, మానవుల దురంతాలు, జాతి తారతమ్యాలు, ఇనుము, బొగ్గు, కిర్సనాలు, పెట్రోలు కోసము నరమాంసము అమ్ముకొనుట, ఈలాంటి విషయాలు చెప్పేవాడు. అతడెన్నో ఆనందసాగరాలు దాటాడు. ఎన్నో కన్నీటి కాలువలు చూచాడు. పనిచేసి అలసిపోయిన పారిశ్రామికులు చిరునవ్వుతో ప్రేమగీతిని పాడుకున్నట్లు అంధకారంలో మిణుగురుపురుగు తళుకుతో కలసి ఏదో తెలియని సుగంధము సోకినట్లు కష్టసుఖాలు కాలాన్ని పంచుకొనటం చూచాడు. రక్తాన్ని బలియిచ్చి వాతావరణాన్ని అనుకూలంగా చేసుకునేవారు, పడిపోయిన కొంపలను బాగుచేసుకునేవారు, కాల్చివేసిన పొలాలలో విత్తనాలు చల్లేవారు, ఆతనిని ఆహ్వానించారు. చైనా, జపాను, బర్మా, భారతదేశాలలో ఆనకట్టలు, ప్రాజెక్టులు, కట్టుకుని, కాలువలు త్రవ్వుకుంటున్నారు. అక్కడ తూర్పుపవనుడు పనివాండ్రతో కలిసి పాడుకున్నాడు. బర్మాలోని వరిపంటచేలను ప్రేమతో నిమిరాడు. భారతీయ వస్త్రపరిశ్రమాగారాలలోని సుతిమెత్తని పట్టుబట్టలను తాకాడు. అతడు ప్రతిరోజు తన తల్లితో జీవితము, పరిశ్రమ, మానవశక్తి ప్రేమనుగురించి కథలు చెపుతూ వుండేవాడు. అ నవ్వితే వినేవారికెందుకో కష్టంగా ఉంటుంది. ఆతని శరీరము నుండి యాలకులు, లవంగాలు, జీలకర్ర, కర్పూరపు వాసనలను గుబాళిస్తూ వుంటాయి. అతడు గంభీరంగా ఏదైనా చెప్పుతూ వుంటే కండ్లు చింతనిప్పలవుతాయి.

వాయుమాత మూడవ కుమారుడు విచిత్ర

మయినవాడు. అతడెవ్వరితోనూ మాట్లాడి ఎరుగడు. అతనినింతవరకు ముసలమ్మ సంచిలో కట్టిపెట్టనే లేదు. కానీ ఈదినంమాత్రం ఏదో పెద్ద హడావుడిచేసియే వచ్చివుంటాడు.

ఏం జరిగింది బాబూ! అని తల్లి గొల్లుమన్నది. నీ వెన్నడూ చెంప్యచేసుకునేవాడివికావే!'

''అమ్మా! నొప్పి! భరించలేకుండా ఉన్నానమ్మా!

నిన్నెవరు కష్టపెట్టారురా?

నాకు తెలియదు.

ఎందుకు తెలియదు?

అమ్మా! యాంగిట్సీ నది ఒడ్డున చేలకోతలు చూస్తున్నాను. అక్కడనుంచి జపానుపోయి, గొల్లవారిపాటలాలకిస్తున్నాను. తర్వాత ప్రశాంత మహాసాగరానికి వెళ్ళాను. జపానువారి పడవలు కనుపించాయి. వాటిమీద కూర్చుండి, చేపలను పిలిచాను. ఎండ తీవ్రంగా ఉంది. సముద్రము శాంతంగా పరిశుభ్రంగా ఉంది. వెలుతురులో నీరు లోతును బట్టి రంగురంగులుగా కనుపిస్తూవున్నది. అందులో తళతళలాడుతూ మృదువైన చేపలు అతి కోమలంగా రంగులు మార్చుకుంటూ నీటిలో ఆడుకుంటూ ఉండగా, చూస్తూవున్నాను. కునుకు పట్టింది. ఇంతలో సముద్రం పొంగసాగింది. ఒక పెద్ద సుడిగుండం సముద్రాన్ని దగ్గరకు లాకుటున్నది. చుట్టుప్రక్కల దీవులు సర్వనాశనమై పోయాయి. పాపము ఆ లంకలలోని వైభవం పరిశ్రమ, సంపద, ప్రేమ అంతా గంగపాలైనాయి. అప్పటి ప్రజల ఏడ్పులింకా వినబడుతూనే వున్నాయి. అంటూ అతను రెండుచేతులూ నెత్తిన పెట్టుకుని బల్లమీద వ్రాలిపోయాడు.

కొంతసేపటివరకు నిశ్శబ్దమావరించింది. దూరాన ధ్వనిశబ్దము మాత్రము వినబడుతున్నది. అతడు తల ఎత్తాడు. ఉన్న ఒకకంటిలోనూ ఒక్క కన్నీటిచుక్క నిలిచిపోయింది. అతడు మరల మొదలుపెట్టాడు చెప్పటం. ''ఒక్క క్షణంలో మబ్బులు కాజేజీపువ్వులాగా విడమరచుకున్నాయి. ఒక విశాలమైన మైదానంలో తిరుగుతున్నాయి. నీలంగా, నారింజరంగుతో వూదావర్ణముతో మెరుస్తున్నాయి. వాటి పొట్టనిండా విషమే. విషవాయువులు వీస్తున్నాయి. అందులో నుంచి నేను ఒక్క గంతేసి కొరియాదాటి ఫిలిప్పైన్, సింగపూరుల మీదుగా ఆస్ట్రేలియాలోని ఎడారిలోకి పరుగెత్తాను. కానీ అక్కడా అంతే! ఆ విషము లోనే నా చర్మం లేచిపోయింది.

ఏమన్నయ్యా! నీవు తిరిగేచోటులో కూడా ఈ గోల వుందా? అని దక్షిణ పవనాన్ని అడిగాడు. తల్లి హైరానపడి విసుగుతో అన్నది ''లోకానికి ఏమీ ఉపద్రవం రాబోతోందో ఇదివరకింత ఘోరము లేదు. ఇంత మారణహోమం లేదు. ఎవ్వరూ నా పిల్లలను ముట్టుకునేవారు కాదు. వాళ్ళకేం చెడ్డరోజులు వచ్చాయో!

''వాళ్ళకు కాదు, మనం చచ్చేరోజులు వచ్చాయి'

ఎవరు మాట్లాడేది అని అందరూ వెనక్కు తిరిగి చూచారు. పడమటి పవనుడువచ్చి ద్వారము దగ్గర నిలిచాడు.

సూటూ, బూటూ, హేటూ, అందరికీ గుడ్ మార్నింగు అన్నాడు.

ఇతడు నవయువకుడు, చాలా అందమయినవాడున్నూ: మాటలలో నింపు, చూపులో ఇంపు, నడకలో ఠీవి కలవాడు. అతడు మా దగ్గరకు వచ్చి నిలబడి జేబులోనుండి ఒక బుడ్డితీసి త్రాగేశాడు ఒక్క గుక్కలో. ... రంగుల రుమాలుతీసికొని మూతి తుడుచుకున్నాడు. మా అందరివంకా చూచి, సగర్వంతో ''పోతారు, అంతా పోతారు. మానవుడు పోవాలని నిశ్చయం చేసుకున్నాడు. చేతనయినంతమందిని చంపి, తాను చచ్చిపోతాడు

వాయుమాత గాభరా పడింది. ''ఏమిటూ నాయనా నీ వనేది?''

పడమటిపవనుడన్నాడు: ''తయారైపోతున్నాయి కోటలు, కందకాలు, భూగర్భంలో అయుధాల కార్ఖానాలు,బాంబరు విమానాల కాలవాలాలు లక్షల సిలండర్లు ... వాటినిండా విషవాయువులు కుక్కి సిద్ధంగా ఉంచారు. ఈ దెబ్బతో మానవత్వమే మాయమైపోతుంది. అందుకొని బతికి ఉండగనే తినండి, త్రాగండి, ఆడండి, ఆనందంగా గడపండి'' అంటూ ఇంకోసారి త్రాగాడు.

ముసలమ్మ అడిగింది వాయుపుత్రులు లేకపోతే ఇక బ్రతికేది ఎవరు?''

''ప్రపంచాన్ని బ్రతికించేది మనము. మన నోటిలో విషము పోసి వాడెట్లా బతుకుతాడు? అన్నాడు పశ్చిమ పవనుడు.

ముసలమ్మ నా వంకచూచి ''నీ వేమీ మాట్లాడవేం?'' అన్నది. వాయుపుత్రులు నలుగురు నావంక చూచారు. నేను మాట్లాడక తప్పింది కాదు

''భూమి, ఆకాశాలమధ్య ఎక్కడో స్వర్గముందని ఎవరో అనగా విన్నాను. దానిమధ్య ఒక చెట్టు ఉందిట. అది జ్ఞానవృక్షముట.

''ఓహో! అదా! ఆదం ఈవ్ దానిపండ్లు తిన్నారు కూడా''

''అదే అదే! ఇరం పేయించిన తోటసంగతి చెపుతున్నావు కదూ''

(ఇరం అనగా మహమ్మదీయ సాంప్రదాయానుసారి శద్దాత్ అనే విశ్వామిత్రుడులాంటి మహర్షి నిర్మించిన త్రిశంకుస్వర్గము లాంటిది)

''అవును. నన్ను అక్కడకు తీసుకుని వెళ్ళు. ఆ చెట్టు చూపిస్తాను.''

ఉత్తర పవనుడు తల్లివంక చూచాడు. తల్లి అన్నది చావుబ్రతుకుల్లో పడి కొట్టుకుంటున్నాడు మనిషి. జ్ఞానమేమైనా కలుగుతుందేమో, తీసికొనివెళ్ళు పాపం''

మరునాడు ఉత్తర పవనుడు నన్ను తన బుజాలమీద ఎక్కించుకుని పోయాడు. దారిలో మైదానాలు, ఎడారులు, అడవులు ఎన్నో తగిలాయి. పైకెగురుతూ పోయాము.

ఇరంతోట ఆకాశంలో ఉందా అని నేను అడిగాను.

కాదు భూమిక్రింద పాతాళంలో వుంది. దాని ద్వారమెక్కడుందో ఎవరికీ తెలియదు. ఆ ద్వారం ముందర ఒక పక్షి పహరా యిస్తూ, ఉంటుంది. దాని ఒకరెక్క జీవనము, రెండవది మరణము. ఆ ద్వారమునకు రెండు తలుపులు ఒకటి పగలు, రెండవది రాత్రి. ద్వారమ్ముపైన ఉన్న ఆర్చి సగము మంచు గడ్డతోను, సగము ఎండలోనూ కట్టబడింది అది విచిత్రమైన ద్వారము. ఈ ద్వారముగుండా పోవువానికేదో క్రొత్త జీవితములోనికి పోవుతున్నట్లనిపించును.

'నాకు చెట్టు చూపించుదూ' అన్నాను నేను.

చెట్టును వూరికే చూచినంత మాత్రాన విశేషమేమీ కనిపించదు. అది మామూలు చెట్టే! చాల ఎత్తుంటుంది. సన్నని కాండము. పైకి ఎక్కటానికి ఆధారంగా కొమ్మలు క్రిందలేవు. మనిషి తన తెలివి తేటలతో పైకి ఎక్కవలసిందే! చెట్టు చిటారున మాత్రము ఒకే ఒక కొమ్మ ఉంది. ఆకొమ్మ చివర ఒకే ఒక ఆకు ఉంటుంది. మనమిప్పుడా చెట్టుదగ్గరలోనే వున్నాము. అంటూ ఉత్తర పవనుడు మబ్బులలో ఒక్క పలిటీ గొట్టాడు. నాకేమో మధురమైన సంగీతము వినిపించుచున్నట్లు తోచింది. సువాసనలు నామీదికి తరుముకొని వస్తున్నాయి. నాకండ్లు మూసికొని పోయినాయి. కండ్లు తెరచుకొనేటప్పటికి మేము ఇరం తోటలో ఉన్నాము.

తోటలోని చెట్లకు పూలున్నాయి. ఆపూలకు కండ్లున్నాయి మెరుస్తూ. అవి తుమ్మెదలతో పాటు ఎగురుతూ పరిగెత్తుతాయి. ఒక నెమలి చెట్టు కనుపించింది. దాని ఆకులన్ని నెమలి కన్నులలాగ ఉన్నాయి. బుల్ బుల్ చెట్టు ఆకులు బుల్ బుల్ పాడినట్లు పాడతాయి. ఇదేవిధంగా కోతిచెట్లు .....కొమ్మకోసం చేయి ఎత్తితే కొమ్మేదగ్గరకు ఎస్తుంది. ఈతోటలో నుంచి వచ్చే సుగంధానికి రంగులు కూడా ఉన్నాయి.

ఉత్తర పవనుడు నన్నడిగాడు జ్ఞానవృక్షమును నీవు చూడదలచుకున్నావా?

అవునన్నట్లు నేను తలవూపాను. ఇంతలో ఒక అప్సరవచ్చి నాప్రక్కన నిలవబడింది. ఆమె అన్నది 'దానిని చూడాలంటె ఒక శిక్ష అనుభవించాలి'.

ఏమిటది?

ప్రేమను వదిలెయ్యాలి.

వదిలేస్తాను.

నిద్ర వదులుకోవాలి.

వదులుతాను,

ఉపవాసాలుండాలి.

ఉంటాను.

చెట్టు ఎక్కుతూ ఉండగా సిగుడ్డలు చిరిగి పోతాయి. నీశరీరమున గాయాలుపడి రక్తంచిందుతుంది.

ఏమీ ఫరవాలేదు.

నీకు పగలు పగలుగానూ, రాత్రి రాత్రిగానూ కనుపించదు. ఎండ, చలి, వేడి, వెన్నెల లేని చోట నీవుండాలి. పాటలు పాడకూడదు.

అన్నిటికీ తయారు.

అయితే నాతోరా!

జ్ఞాన వృక్షము నేననుకున్న దానికంటే పెద్దదిగా ఉంది. మేఘజాలములా తరువును పరిభ్రమిస్తూ పోతున్నాయి. ఆచెట్టు కొకే కొమ్మ, ఆకొమ్మకొకే ఆకు, మానవుని గుండె కాయ ఆకారంతో ఉండి రెప రెప లాడుతున్నది.

అప్సర చెప్పింది....అదిగో ఆయాకు మీదనే నీప్రశ్నకు జవాబు వ్రాయబడి ఉంది.

ఉత్తర పవనుడు ప్రశ్న జ్ఞాపకము చేశాడు.

''పవనతనయులు కూడా పోతారా'' ఒకవేళ దీనికి జవాబు రాకపోతే ఎట్లా? అని సందేహంగా ప్రశ్నించాడు.

అజ్ఞాన వృక్షమెక్కుట చాలాకష్టము. రెండడుగులు ముందుకు వేస్తే ఒకడుగు జారుతున్నాను. నాయానంద మెటు పోయిందో! నాప్రేమ ఎటు జారిందో! నాగుండెలాడు తున్నాయోలేదో!కంటిలోని తేజస్సు ఆరిపోయింది. కన్నీరెప్పుడో ఇంకి పోయింది. ఋతువులన్నీ ఒక్క సారే కలిసి నాకెదురైనాయి. పూవులు నన్ను పిలు స్తున్నాయి. ఎండ వేడి దాహం తీర్చుకుంటానికి నాశరీరములోని నీటిని త్రాగేస్తున్నది. చలికి శరీరము గడ్డ కట్టుకు పోతున్నది. మంచు గడ్డలు తెల్ల ఎలుగుల్లాగ గుండెల్లోని రక్తాన్ని పీలు స్తున్నాయి. ఈఋతువులను దాటి పైకి పోగానే సుగంధము నన్ను పిలిచింది.

'వాయువు చనిపోతుందా'' అంటూ ఉత్తరపవనుడు నాప్రశ్నను జ్ఞాపకం చేస్తున్నాడు.

ప్రఖ్యాతి అనే సుగంధం కోసము ప్రాకు లాడేవానికెన్నో వూహలు పుడతాయి. ఎంతో త్యాగం చేస్తాడు. ఇందు: లనే అతను సంపా దించుకునేదేమిటి? కమ్మని ఈ జీవితాన్ని బలి ఇచ్చేస్తాడెందుకో? ఆనందంగా ఉండమని ఎన్నోవస్తువులతన్ని పిలుస్తున్నాయి. అన్నిటిని వదలుకొనిపైకెక్కిపోతూనేఉంటాడు మూన్నాళ్ల ముచ్చట కోసము.

నేను ఇంకా పైకి పోయాను. అంతా నిశ్శ బ్దము— ''నీకు దిక్కులేరు. ఒంటరిగాడివి. ముసలివాడివై పోతున్నావు. శరీరపటుత్వము తప్పిపోతున్నది ఇక ముందుకు సాగలేవు.'' అన్నా రెవ్వరో!

చిటారుకొమ్మ గజం దూరంలో ఉంది. ''ఆశలు వదిలెయ్యి. విశ్రాంతి తీసికో! చేతులు వదిలెయ్యి, చల్లగా జారిపో, జారటములో చాలా సుఖముంది తెలిసికో అంటున్నది శబ్దము''

నేనేదో విధంగా తంటాలుపడి జ్ఞానవృక్షపు ఆకు త్రుంచాను. వెంటనే ఆ చెట్టు నాతోపాటు ఒక్కసారి క్రిందికి ఒరిగింది. నేను మరల మున అమ్మ గోతిలో పడ్డాను. నాచేతిలో ఈ ఉన్నది ఆకు కాదు. మానవ హృదయం.....దానిమీద ''శాంతి'' అని వ్రాసి ఉంది.

'శాంతి'' దీనివల్ల ఏమవుతుంది? అను కున్నాను. ''నాకు చూపించు'' అని ఏదో మధుర కంఠం నన్ను కదిలించింది. వెనక్కి తిరిగి చూచాను. తోటలో కనుపించిన అప్సర! ఆకు ఆమెకిచ్చాను.దానిమీద ఆమె సంతకము పెడుతూ ''ఈ ఆకును ప్రపంచంలో అందరికీ చూపించు'' అన్నది.

దీనివలన ఉపయోగమేమిటన్నాను.

ఆమె నవ్వి 'అక్షరానికక్షరం జోడించే షేక్స్పియరు పుట్టాడు. రాయి రాయి కలిసే తాజ్మహలయింది. శాంతి సందేశముతో పెద్ద గొలుసు తయారుచేసి ప్రపంచాన్ని కట్టి వేయుము''

నాకిప్పుడర్థమైంది. ఆయాకును బొడ్లో పెట్టుకొని నెమ్మది నెమ్మదిగా గుహ దాటి బయటపడ్డాను. ఎండ ఎంతో హాయిగా ఉంది. దూరాన కొండలలోంచి 'శాంతి శాంతి' అంటూ ధ్వని వినిపిస్తోంది.

ఫోటో : ప్రభాకర్ మహాధిక్

